


# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**SEPTEMBER - 2011**

సంవత్సర చందా రూ. 50/-

# మీ కొక గొప్ప సదవకాశం

**సత్యవాణి** ద్వారా ప్రచురించబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500 రూ॥లు అగును. గాని మీరు 85 /-రూ॥లు మాత్రమే మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్ విద్యార్థులకు, బోధకులకు, తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.

మా అడ్రస్:


Satya Vani

# 7-9-35, Sambamurty Street,

Kakinada - 533 004. Ph: 0884 - 2363722

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH



P.o. Box -80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**



*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 33 | సెప్టెంబరు - 2011 | సంచిక - 2


## దేవునికి అంగీకారముగు ఆరాధన
(ACCEPTABLE WORSHIP TO GOD)

మానవుడు సహజముగా దేవుని నారాధించు గుణము కలిగినవాడు. మానవులనేక దేవుండ్లను, దేవతలను చేసికొని పూజించుచున్నారు అంటే వారికి ఉన్న ఈ భక్తి తత్వము వెల్లడియగుచున్నది. గ్రీసు దేశస్థులు ఇంచుమించు 30వేల దేవుండ్లను ఆరాధించేవారు. నేడు హిందు దేశము కూడా ఈ సంఖ్యలో ఏమంత వెనుకగా లేదు.

నేనిదివరకొకసారి చెప్పిన రీతిగ మానవులు చేయు ఆరాధన అంతయును దేవునికి అంగీకారయోగ్యమైనదికాదు.

అనేకులు నిజదేవుని ఆరాధించకపోవుట వలన వారి ఆరాధన వ్యర్థమగుచున్నది, దేవుడు కాని దేవుని మనం ఆరాధిస్తే ఏమి లాభము?

అనేకులు సరియైన దేవుని ఆరాధించినను, ఆ ఆరాధనను సక్రమముగా జరుపరు. వాక్యప్రకారము లేని క్రియలను ఆరాధనలో చేయుటచే, వారి ఆరాధన నిష్ఫలమగుచున్నది.

మరికొందరు నిజదేవుని వాక్య

ప్రకారము ఆరాధించినను సరియైన మనస్తత్వము లేకుండా ఆరాధించెదరు. అందువలన వారి ఆరాధనకూడ వ్యర్థమగును. అందువలన దేవునికి ప్రీతికరమైన ఆరాధన యెట్లు చేయవలెనో మనం ఎరుగవలెను. ఆయనకు అంగీకారయోగ్యమైన ఆరాధన మనం చేయుటకు తెలిసికొనవలెనంటే ఆయన తన గ్రంథమందు ఆ అంశము పైఏమిబయలుపరచెనో తెలిసికొనవలెను.

ఆయనను ఆరాధించు విషయములో దేవుడు మానవులకు పదేపదే షరతులను(Instructions) ఇచ్చెను. ప్రత్యక్ష గుడారమును నిర్మించుటలోను యాజక ధర్మవిషయములోను, బలిపీఠము విషయములోను యాజక ధర్మవిషయము లోను, బలుల విష యములోను దేవుడు తన ఆజ్ఞలను మోషే ద్వారా పాతనిబంధన కాలమందు బయలు పరచెను (లేవీ 10:1-2).

ఇప్పుడు యేసుక్రీస్తు ద్వారా దేవుని మనం ఆరాధించుట యెట్లో క్రొత్త నిబంధన యందు ఆయన బయలుపరచి యున్నాడు. గనుక క్రైస్తవ యుగములో మనము దేవుని నారాధించుట యెట్లో తెలిసికొనవలెనని, క్రొత్త నిబంధన గ్రంథము ఏమి చెప్పుచున్నదో ముందు మనం తెలిసికొనవలెను. అపొస్తలుల కాలములో, ఆదిమ క్రైస్తవులు ఆరాధనలో ఏమేమి చేసిరో గ్రహించి, వాటినికూడా ఈనాడు మనం ఆరాధనలో చేసిన యెడల అది అంగీకార యోగ్యమైనది అగును.

మొదటి క్రైస్తవులు "అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుట యందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి" అని అపో.కా. 2:42లో మనకు కన్పడుచున్నది. ఆరాధనకు కూడి వచ్చినప్పుడు "సంగీతములతోను, కీర్తనలతోను, ఆత్మ సంబంధమైన పద్యములతోను ఒకనినొకడు బోధించును, బుద్ధిచెప్పుచు, కృపా సహితముగా మీ హృదయములలో దేవుని గూర్చి గానము చేయుడి" అని అపొస్తలుడైన పౌలు కొలస్స 3:16లో హెచ్చరించు చున్నాడు. మరల, "నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండ ప్రతి ఆదివారము న మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను" అని అతడు 1 కొరింథి 16:2 లో చెప్పెను.

మనం యింత వరకు చూచిన వాక్యములనుబట్టి ఆదిమ క్రైస్తవులు ఆరాధనలో కనీసం 5 క్రియలను చేసిరి యని గ్రహించాము. వారు పాటలు పాడిరి. ప్రార్థన చేసిరి. వాక్యోపదేశము ను జరిగించిరి. ప్రభురాత్రి భోజనమును ఆచరించిరి, కానుకల నిచ్చిరి. ఆ అయిదు క్రియలను మనము కూడా మన ఆరాధనలో జరిగించిన యెడల అది వాక్య ప్రకా

గదా? అందు వలన అది దేవునికి ప్రీతికరమైన ఆరాధనయగును గదా? క్రొత్త నిబంధన లోని 5 ఆరాధన అంశములను మనం ఇప్పుడు కొంత పరిశీలించుదాం.

1. ఆదిమ క్రైస్తవులు ఆరాధనలో పాటలు పాడిరి. వారు దేవునికి స్తుతిగాన ములు చేసిరి. " ఒకని నొకడు కీర్తనల-తోను, సంగీతములతోను. ఆత్మ సంబంధ మైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి" యని ఎఫెసీ 5:19 లో పౌలు హెచ్చరించుచున్నాడు. క్రొత్త నిబంధన ఆరాధనలో దేవుడు మన స్వరగానము కోరినట్లు కన్పడుచున్నది. అందు క్రైస్తవులు ఆరాధనలో వాయిద్యములు ఎన్నడును వినియోగించలేదు. వాయిద్యములను క్రైస్తవ ఆరాధనలోనికి ఇంచుమించు క్రీ॥శ॥ 670 వ సంవత్సరములో కేథలిక్కులు ప్రవేశపెట్టిరి. దేవుడయితే మన స్వరగానమునే కోరుచున్నాడు. మానవ కల్పిత సంగతులతో మనం దేవుని ఆరాధించిన అది వ్యర్థమని మనం ఇదివరకే గమనించితిమి గదా? (మత్తయి 15:7-9).

2. మొదటి క్రైస్తవులు ప్రార్థన చేయుటకు కూడుకొనిరి. "మీరు ఎడతెగక నిత్యము ప్రార్థన చేయవలెను"అని అపొ పౌలు బోధించుచున్నాడు (1థెస్స 5:17). మనము విసుగక నిత్యము ప్రార్థన చేయవలెను అని యేసు బోధించెను (లూకా 18:1). ప్రార్థన ద్వారా మనము దేవునితో మాట్లాడుదుము. గనుక ప్రార్థనలేని ఆరాధన, ఆరాధన కానేరదు అని గ్రహించవలెను.

3. క్రొత్త నిబంధన క్రైస్తవులు దేవుని వాక్యమును చదివి ధ్యానించుటకు కూడుకొనిరి. మనము లేఖనములను పరిశోధింపవలెను అని క్రీస్తు బోధించెను (యోహాను 5:39). "దేవునియెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను, నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్త పడుము" అని పౌలు తిమోతిని హెచ్చరించెను (2 తిమో 2:15). బైబిలును చదువుట ద్వారా దేవుడు మనతో మాటలాడును. ఆ గ్రంథమందు ఆయన చిత్తమును మనకొరకు బయలుపరచెను గనుక ఆయన చిత్తము నెరుగుటకు మనం ఆయన గ్రంథమును పఠించి ధ్యానింపవలెను. దేవుని గ్రంథమును చదువకుండ ఆరాధన ను జరిగించుట మనం ఊహించుకొన లేముగదా.

బైబిలుగాక మనం మానవులు వ్రాసిన ప్రమాణ పుస్తకములను పఠించిన అది వ్యర్థారాధన అగును అని మనం సులభముగా గమనించగలము కదా!.

4. మొదటి క్రీస్తు సంఘస్తులు ప్రతి ఆదివారమున ఆరాధనలో రొట్టె విరుచు

టకు కూడుకొనిరి. అపో.కా.20వ అధ్యాయము 7వ వచనములో "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు, పౌలు మరునాడు వెళ్లనైయుండి, వారితో ప్రసంగించుచు అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడుచుండెను"అని యున్నది. మత్తయి వ్రాసిన సువార్త 26:26-28 వరకు ఉన్న వచనములో యేసుక్రీస్తు ఈ భోజనమును స్థాపించెను. రొట్టెను ఆయన శరీరమునకు, ద్రాక్షారసమును ఆయన రక్తమునకు గురుతుగా యేసుప్రభువు వాటిని మనకిచ్చెను. ప్రతి క్రైస్తవుడు ప్రభువు బల్లదగ్గర ప్రతి ఆదివారమున తప్పక కూడుకొనవలెను. ప్రభువు వచ్చువరకు ప్రభురాత్రి భోజనము నాచరించుచు, ఆయన మరణమును పునరుత్థానమును ప్రతి క్రైస్తవుడు ప్రచురించవలయును (1 కొరింధి 11:23-26).

5. మొదటి క్రైస్తవులు ఇచ్చుటకు ప్రతి ఆదివారమున కూడుకొనిరి. వారు వర్ధిల్లిన కొలది కానుకలు ఇచ్చుటకు ఆదిమ క్రైస్తవులు కూడుకొనిరి. "నేను వచ్చినప్పుడు చందాను పోగుచేయకుండా ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లినకొలది తనయొద్ద కొంత సొమ్ము నిలువచేయవలెను" అని పౌలు 1 కొరింధి 16:2 లో చెప్పి యున్నాడు. "కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంటకోయును, సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంటకోయును. సణుగుకొనకయు, బలవంతముగా కాకయు ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను; దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును" అని పౌలు మరల చెప్పుచున్నాడు (2 కొరింధి 9:6-7).

దేవునికి అంగీకారయోగ్యమైన ఆరాధన ఇట్లుండవలెను. ఆరాధనలో వాయిద్యములు లేకుండ మనము పాటలు పాడవలెను, ప్రార్ధన చేయవలెను, వాక్యమును వినవలెను, ప్రభు రాత్రి భోజనమును చేయవలెను. తరువాత కానుకలు ఈయవలెను. ఈ ఆరాధన క్రియలన్నిటిని మనము సరియైన మనస్తత్వము కలిగి చేయవలెను. దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను. సత్యముతోను ఆరాధించ వలెనని ఆయన కోరుచున్నాడు. గనుక మనము ఆరాధన చేయునప్పుడు అర్ధము చేసికొని ఆరాధించవలెను.

క్రొత్త నిబంధన సూచించు దైవారాధనకంటె తక్కువ చేసినయెడల అది సత్యారాధన కాదు. సమస్తమును మనము వాక్యప్రకారము చేసినప్పుడే అది అంగీకారయోగ్యమైన ఆరాధన యగును. "క్రీస్తు బోధయందు నిలచియుండక దానిని విడిచి ముందుకు సాగు ప్రతివాడు దేవుని అంగీకరింపని వాడు; ఆ

బోధయందు నిలిచియుండువాడు, తండ్రిని కుమారుని అంగీకరించువాడు" అని వాక్యము బోధిం చుచున్నది. (2 యోహాను : 9).

మనము చేయు ఆరాధన అంతయు దేవుని మహిమ కొరకు చేయవలెను. సంఘములో దేవునికి మహిమ కలుగవలెను. గనుక మన ఆరాధన అంగీకారయోగ్యముగా నుండ వలెననిన మనము యేసుక్రీస్తు సంఘ సభ్యులమైయుండవలెను. క్రీస్తు సంఘస్థులమైయుండవలెననిన, యేసుక్రీస్తు సంఘస్తులోనికి బాప్తిస్మము పొందవలెను. అట్లు ముంచడము పొందిన ప్రతివారిని ప్రభువు తన సంఘముతో చేర్చుకొనును. "క్రీస్తు యేసు మూలముగా సంఘములో తర తరములు సదాకాలము మహిమ కలుగునుగాక" (ఎఫెసీ 3:21). ఆయనను మహిమపరచు నిమిత్తము మీరు అతి త్వరలో ఆయనిచ్చు రక్షణను అంగీకరించుదురని నా విశ్వాసము!!.

క్రైస్తవరుజువులు :

## సంశయించు వారి సమస్యలు
(Doubters Difficulties )

బైబిలులో స్వవిరుద్ధ సంగతులుగా కనబడు వాటిని చూపించు సందేహశీలురు ఆ గ్రంధాన్నిహేళనచేతురు. స్వవిరుద్ధ సంగతులుగా కనబడు వాటన్నిటికీ వివరణ మనం ఇయ్యవచ్చును. అయితే ఈ సందేహించేవారు బైబిలు పండితులు యిచ్చే వివరణను లక్ష్యపెట్టరు గాని పందలాది సంవత్సరముల కొలదీ వచ్చుచున్న తమ అభ్యంతరములనే తిరగతోడుదురు.

పైకి పొరబాట్ల వలే కనబడు విషయాలను కొంచెం శ్రద్ధవహిస్తే వాటిని మనం పరిష్కరించ వచ్చును. పురాతన భాషలను గూర్చి, చూచి వ్రాత వ్రాసే వారి పొరబాట్లను గూర్చి, భూగోళ శాస్త్రము, పురాతన సంస్కృతులు, పురావస్తు శాస్త్రము మొ॥గు వాటిని గూర్చి మనము తెలిసికోనేకొలదీ ఒక దానితో నొకటి విరుద్ధముగా యున్నట్లగుపడు లేఖనములను మనం సులువుగా సమైక్య పరచ వచ్చును.

అట్టి పొరబాట్లని చెప్పబడే కొన్నింటిని ఈపాఠంలో మనం గమనించుదము. పరీక్షించగా అవి మాయమై, బైబిలు యొక్క

నమ్మకత్వాన్ని ధృఢపరచునో లేదో గమనించుదాం.

**ఆదికాండము 1 అధ్యాయము & 2 వ అధ్యాయము:**

ఆదికాండము మొదటి రెండు అధ్యాయాల్లోస్వవిర్ధు సంగతులున్నాయని కొందరు తలంచెదరు.

ఆది 1:12 వృక్ష జాతులు మూడవ దినమందు సృజింపబడెనని చెబుతున్నది. ఆది.కా. 1:20-25 లను బట్టి జంతువులు 5వ, 6వ దినమందు సృజింపబడెను. ఆది 1:27 పురుషుడు స్త్రీ ఆరవ దినమందు సృజింపబడెనని చెప్పుచున్నది. జంతువులు తరువాత వారు సృజింపబడిరి. వృక్షములు మొదట, జంతువులు తరువాత, మానవులు అటు తరువాత కలిగెను.

అయితే ఆదికా 2:5-7,19 లో వృక్షముల కంటె ముందు మానవుడు సృజింపబడినట్లు చెప్పుచున్నది. ఇదేమిటి? దీనికి జవాబు చాల సూక్ష్మమే.

ఆదికాండము మొదటి అధ్యాయములో ఏ రోజున యేమి సృజింపబడెనో క్రమ ప్రకారము చెప్పబడెను. రెండవ అధ్యాయమైతే క్రమపద్ధతిని బట్టి గాక, దేవునితో మానవుని సంబంధమును ముఖ్యముగా వివరించుచున్నది. ఆది 2:8 "దేవుడైన యెహోవా తూర్పున ఏదెనులో ఒక తోట వేసి తాను నిర్మించిన నరుని దానిలో ఉంచెను" అని చెప్పుచున్నది. 2:19, "దేవుడైన యెహోవా ప్రతి భూజంతువును, ప్రతి ఆకాశ పక్షిని నేల నుండి నిర్మించి ......" అని చెప్పుచున్నది. యిది స్వవిరుద్ధముగా కనబడు దానిని నిర్మూలించుచున్నది.

**భూమి యొక్క ఉనికి :**

"తరము వెంబడి తరము గతించిపోవుచున్నది, భూమి యొక్కటే యెల్లప్పుడు నిలుచునది" (ప్రసంగి 1:4).

"అయితే ప్రభువు దినము దొంగ వచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును, పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దాని మీద నున్న కృత్యములు కాలిపోవును" (2 పేతురు 3:10).

'యెల్లప్పుడు' అను మాట 'ఓలమ్' అను హెబ్రీ మాట నుండి వచ్చినది. ఓలమ్ అనగా నిర్ణయము కాని దీర్ఘ సమయము, చాలా కాలము అని యర్థము. నిత్యము అనే భావము ఆదిమ భాషలో లేదు. ఈ భూమి ఎంత కాల ముందునో మనకు తెలియదు అని ప్రసంగి చెప్పుచున్నాడు. అయితే ప్రభువు దినమందు ఈ భూమి కాలిపోవునని పేతురు చెప్పుచున్నాడు. ఈ రెండు

లేఖనాలలోను పొసగనిది యేమీ లేదు.

**దేవుని చూచుటను గూర్చి :**

"యాకోబు-నేను ముఖాముఖిగా దేవుని చూచితిని. అయినను నా ప్రాణము దక్కినదని ఆ స్థలమునకు పెనూయేలు అని పేరు పెట్టెను" (ఆదికా 32:30).

"ఎవడైనను ఎప్పుడైనను దేవుని చూడలేదు" (యోహాను 1:18). దేవుని ప్రక్షతతోనే గాని సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞానియు ఆత్మయైన దేవునితో యాకోబు నేరుగా పోరాడలేదు ఆత్మ స్వరూపియైన దేవుని ఎవడు చూడలేదు, గాని దృశ్యమగు రీతిగా దేవుడు అబ్రాహాము, యాకోబు, మనోహ అతని భార్య మొదలగు వారికి కనబడెను (ఆది.కా. 18:1-33; 22:11-19; న్యాయాధి 13:2-22). చివరిగా ఆయన అందరికీ కనబడులాగున యేసుక్రీస్తులో ప్రత్యక్షమాయెను. యేసుక్రీస్తు ఇమ్మానుయేలు, అనగా దేవుడు మనకు తోడని అర్థము (మత్త 1:18-23). ఈ వచనాల మధ్య స్వవిరుద్ధం యేమీ లేదు.

**సున్నతి :**

"నాకును నీకును నీ తరువాతి సంతతికిని మధ్య మీరు గైకొనవలసిన నిబంధన యేమనగా - మీలో ప్రతి మగవాడును సున్నతి పొందవలెను" (ఆదికా 17:10).

"క్రొత్త సృష్టిపొందుటయే గాని సున్నతి పొందుట యందేమియు లేదు,పొందక పోవు ట యందేమియు లేదు" (గలతీ 6:15).

దేవునికి, అబ్రాహామునకు అతని సంతతికి మధ్య సున్నతి ఒక గురుతు. అది ఎన్నడు క్రైస్తవులతో దేవుడు చేసిన క్రొత్త నిబంధనలో లేదు. క్రొత్తనింబంధనలో క్రైస్తవులు 'హృదయమందు సున్నతి పొందిన వారు' (రోమా 2:29). అది బాప్తిస్మములో పాపములను విసర్జించుటయే. ఆదికాండములో దేవుడు అబ్రాహాముతో మాటలాడుచుండెను. గలతీ పత్రికలో పౌలు క్రైస్తవులతో మాటలాడు చుండెను. ఇక్కడ కూడ స్వవిరుద్ధం యేమీ లేదు.

**శిక్ష:**

"పాపము చేయువాడే మరణము నొందును; తండ్రి యొక్క దోష శిక్షను కుమారుడు మోయుట లేదని కుమారుని దోష శిక్షను తండ్రి మోయడు" (యెహెజ్కేలు 18:20).

"నీ దేవుడైన యెహోవానగు నేను రోషము గల దేవుడను, నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరముల వరకు తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పించు తును"

(నిర్గమ 20:5).

యోహెజ్కేలు దేవుని న్యాయమును గూర్చి చెబుతు ఆయన నిర్దోషులను శిక్షించడని చెప్పుచున్నాడు. నిర్గమ కాండములో పదియాజ్ఞలలో దేవుడు పాపము యొక్క పర్యవసనాన్ని గూర్చి చెప్పుచున్నారు. దేవుని ద్వేషించు తల్లిదండ్రులు తమ పిల్లలను కూడా అట్లే పెంచుదురు. అదొక అంటు రోగము వలె తరతరములకు వ్యాపించును. దేవుని ద్వేషించు తల్లిదండ్రుల పిల్లలు అమాయకులే అయినను తమ తండ్రుల పాపముల పర్యవసనాన్ని అనుభవింతురు. ఈ వచనా లలో ఏ విధమైన స్వవిరుద్ధము లేదు.

**గణితంలో పొరబాట్లని చెప్పేవి :**

అంకెలలో బైబిలు తప్పు చెప్పుచు న్నది గనుక అది నమ్మదగినది కాదని కొందరంటారు. హెబ్రీ భాషలో కొన్ని అంకెలు ఒకే లాగున కనబడును గనుక బైబిలు ప్రతులను చేవ్రాతతో వ్రాసే వారు కొన్ని చోట్ల పొరబాటు చేసి యుండ వచ్చును. అయితే పలు సందర్భాలలో న్యాయ సమ్మతమైన వివరణ ఇయ్య వచ్చును.

ఉదాహరణకు 2 సమూయేలు 24:24లో దావీదు రాజు అరౌనా యొద్ద కళ్లమును, ఎడ్లను ఏబది తులముల వెండికి కొనెను అని చెప్పబడి యున్నది . అయితే 1 దినవృత్తాంతములు 21:25లో దావీదు "ఆ భూమికి ఆరువందల తులముల బంగారమును అతనికిచ్చెను" అని వ్రాయబడి యున్నది. 2 సమూయేలు 24:24 లో దావీదు ఆ కళ్లమును ఎడ్లను ఏబది తులముల వెండికి కొనెను" అనియుంటే 1 దిన 21:25లో దావీదు ఆ భూమికి ఆరువందల తులముల బంగారమును అతనికిచ్చెను" అని యున్నది. ఆ భూమి అనగా ఆ కొండప్రాంతమంతయునని ఖచ్చితంగా మనం చెప్పవచ్చును. దావీదు కళ్లమును, ఎడ్లను యాబది తులముల వెండికిని, ఆరువందల తలుముల బంగారమును ఆ భూమికిని యిచ్చెను. అది మోరియా కొండ, ఆ కొండ అంతయు బహుశ దావీదు కొనెను. ఏలయనగా ఆ కొండమీదనే దావీదు కుమారుడైన సొలొమోను దేవుని మందిరమును నిర్మించెను. అందువలన ఇక్కడ స్వవిరుద్ధం యేమీ కన్పడదు.

**నైతిక విలువలలో వివక్షత :**

కొందరు బైబిలులో అ నైతిక విలువలున్నాయని వాటిలో కొన్ని స్వవిరుద్ధంగా యున్నాయనీ చెబుతారు. ఉదాహరణకు ద్వితీ 7:2లో కనానీయులను పూర్తిగా నాశనం చేయాలని ఆయన ఇశ్రాయేలీయులకు ఆజ్ఞయిచ్చారు. అయితే "ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా ఆజ్ఞాపించినట్లు అతడు శేషమేమియు లేకుండ ఊపిరిగల సమస్తమును నిర్మూలము చేసెను" అని యెహోషువ 10:40 లో వ్రాయబడి యున్నది.

ఈ వచనములు పదియాజ్ఞలలో 6వ ఆజ్ఞను బైబిలులో నరహత్యను గూర్చిన మిగతా లేఖనములను వ్యతిరేకముగా యున్నట్లు కనబడుచున్నవి (నిర్గమ 20:13). కరుణ, ప్రేమగల మంచి దేవుడు ఒక జనాంగ నిర్మూల మును ఆజ్ఞాపించడు.

అయితే పైకి కనబడుదానికంటే దీనిలో ఇంకా వున్నది, ఆదికాండము 15:16; ద్వితీయో 9:4-5ను బట్టి కనానీయులు బహు అక్రమకారులని చెడుతనము జరిగించువారని మనము తెలిసికొనవచ్చును. అందువలన దేవుని తీర్పును వారిపైకి తమ్మును తామే రప్పించుకొనిరి. వారు ఇశ్రాయేలీయులను విగ్రహారాధనకు, అక్రమమునకు, చెడుతనమునకు నడిపింతురని దేవుడెరుగును. వారు మానవ జాతి రక్షణ విషయమై దేవుని సంకల్పమునకు అడ్డుగా వచ్చెదరని ఆయన ఎరుగును. ఈ లోక రక్షణ అంతా ప్రమాదములో పడును. గనుక తీవ్రమైన చర్య అవుసరమాయెను. తాను సృష్టించిన వారి దుష్టత్వమును శిక్షించుటకు దేవునికి సర్వ హక్కులువున్నవి. అందువలన ఇక్కడ అనైతిక సంగతి యేమీ లేదు. దేవుడు యదార్థవంతుడు.

**శతాధిపతియా? యూదుల పెద్దలా?**

"ఆయన కపెర్నహూములో ప్రవేశించినప్పుడు ఒక శతాధిపతి ఆయన యొద్దకు వచ్చి ప్రభువా నా దాసుడు పక్షవాయువుతో మిగుల బాధపడుచు ఇంటిలో పడియున్నాడని చెప్పి ఆయనను వేడుకొనెను" అని మత్తయి 8:5-6లో వ్రాయ బడియున్నది.

గాని "......... తరువాత ఆయన కపెర్నహూములోనికి వచ్చెను. ఒక శతాధిపతికి ప్రియుడైన దాసుడొకడు రోగియై చావసిద్ధమై యుండెను. శతాధిపతి యేసును గూర్చి విని ఆయన వచ్చి తన దాసుని స్వస్థపరచవలెనని ఆయనను వేడుకొనుటకు యూదుల పెద్దలను ఆయన యొద్దకు పంపెను" అని లూకా 7:7-8లో వ్రాయబడియున్నది.

పురాతన ఇశ్రాయేలులో యున్న సంప్రదాయ ప్రకారము ఈ శతాధిపతి యూదుల పెద్దలను మొదట పంపి, తదుపరి తానే స్వయముగా ఆయనను వేడుకొనెను. ఈ సందర్భములో యూదుల పెద్దలు, శతాధిపతియు కూడ ఆ దాసుని గూర్చి యేసు విన్నవించుకొనిరి.

**యేసు యొక్క వంశావళి :**

దావీదు దగ్గర నుండి యేసు యొక్క వంశావళి మత్తయి లూకా సువార్తలలో వేర్వేరుగా కనబడుచున్నది ఎందువలన ?

లూకా సువార్తలో యున్న వంశావళి ఆయన సహజ తల్లియైన మరియ యొక్క వంశావళిని బట్టి చెప్పబడినది.

మత్తయిలో చెప్పబడిన వంశావళియైతే మామూలుగా వాడే పద్ధతిలో యేసు యొక్క పెంపుడు తండ్రియైన యోసేపు తరపు నుండి చెప్పబడినది. మత్తయి యేసు యొక్క మానవతత్వాన్ని వర్ణించాడు. మత్తయి ఒక యూదుడు. అతడు యేసు యొక్క వంశ వృక్షమును అబ్రాహాము, దావీదుల వరకు తెలియజేసాడు. లూకా ఒక అన్యుడు అతడు యేసు వంశావళిని మానవ జాతి కంతకు పితరుడైన ఆదాము వరకు తెలియజేసాడు. మత్తయి మరియ భర్తయైన యోసేపు యొక్క శాసనపరమైన వంశావళిని గూర్చి చెప్పాడు. లూకా శరీర సంబంధమైన వంశావళిని గూర్చి చెప్పాడు. అతడు మరియ తండ్రియైన హేలీని, యోసేపు తండ్రిగా చెప్పాడు. యిది వింతగాయుంటే నేడు అనేక మంది అల్లుళ్లు తమ మామలను నాన్నగారు (తండ్రి) యని సంబోధిస్తారు.

లూకా వ్రాసిన వంశావళిలో యేసు "యోసేపు కుమారుడని" యెంచ బడెనని'' వ్రాసాడు. అట్లనుటలో మరియ ఒక్కతే ఆయన మానవ మాత్రురాలైన తల్లియని ప్రబోధించాడు. యేసుకు భౌతిక తండ్రిలేడు. అందువలన మత్తయి, లూకాలు వ్రాసిన వంశావళిలో యేమీ స్వవిరుద్ధము లేదు.

వారు విన్నారా ? వినలేదా ?

బైబిలులో పొరబాట్లవలె కన్పడునవి తర్జుమాలో దొర్లినవే గాని అవి ఆదిమ ప్రతిలో లేవు. ఉదాహరణ యేసు సౌలుకు దమస్కుకు పోవు మార్గములో ప్రకాశమానమైన వెలుగులో కనబడెను. అపొ.కా. 9:7లో లూకా సౌలుతో "ప్రయాణము చేసిన మనుష్యులు ఆ స్వరము వినిరి గాని యెవనిని చూడలేదని" వ్రాసాడు. అయితే సౌలు "నాతో కూడనున్న వారు ఆ వెలుగును చూచిరి గాని, నాతో మాటలాడిన వాని స్వరము వినలేదు'' అని అపొ.కా 22:9లో చెప్పాడు. అతనితో యున్నవారు ఆ స్వరాన్ని అర్థము చేసికొనే రీతిగా వినలేదు. ఈ రెండు వచనాలు ఒకే సంగతిని వేర్వేరు విధముగా చెప్పు చున్నవి. స్వవిరుద్ధం యేమీ లేదు.

**ముగింపు :**

సందేహించువారు తరుచు చెప్పు స్వవిరుద్ధ సంగతులులాంటిని ముఖ్యముగా పరిశీలించాము. గాని బైబిలు యదార్ధమైనదనే కనుగొన్నాము. పొసగని సంగతులని చెప్పబడే వాటన్నిటికీ బైబిలు లోనే జవాబున్నది. బైబిలులో దోషమున్నదని దాని శత్రువులు ఎన్నడు నిరూపించలేరు. అది దేవుని వాక్యము గనుక బైబిలు నమ్మదగినది.

– రిచర్డ్ ఏడీ

## సంఘపెద్దలు, వారి కృషిలో ఐక్యత

పెద్దల యొక్క స్వభావమును ఆ స్థానికి సంఘము ప్రతిబింబించును. సంఘములో శాంతి సమాధానములున్నట్లయితే, పెద్దలలో శాంతి సమాధానమున్నదన్నమాట. సంఘములో శాంతి సమాధానముల కొరకు పెద్దలలో శాంతి సమాధానములకొరకు పెద్దలే కృషి చేయాలి. అపొ. పౌలు సహోదరులకిట్లు విన్నవించాడు : "కాబట్టి మీరు సమాధానమను బంధము చేత ఆత్మ కలిగించు ఐక్యమును కాపాడుకొనుట యందు శ్రద్ధ కలిగిన వారై ప్రేమతో ఒకనినొకడు సహించుచు, మీరు పిలువబడిన పిలుపునకు తగినట్టుగా దీర్ఘ శాంతముతో కూడిన సంపూర్ణ వినయముతోను సాత్వికముతోను నడుచుకొనవలెనని ప్రభువును బట్టి ఖైదీనైన నేను మిమ్మును బతిమాలుకొనుచున్నాను" (ఎఫెసీ 4:1-3).

**కార్యక్రమముల క్రమపద్ధతి:**

పెద్దలలో ఐక్యతకాపాడబడాలంటే వారి సమావేశములు ఒక నియమము చొప్పున క్రమపద్ధతిలో జరిగించబడాలి. బైబిలు ఇట్టినియమములనేమీ ఇయ్యలేదని మనం ఎరుగుదుము. అదే రీతిగా పెద్దలు నిర్వహించు బిజినేస్ మీటింగ్‌లను గూర్చి కూడ అది చెప్పుట లేదు. గాని పెద్దలు కలిసి పనిచేయాలంటే వారు కలిసి కూడుకోవాలి. వారు కలిసి కూడు కొనుచున్నప్పుడు వారి పనులన్నీ క్రమముగాను మర్యాదగాను జరగాలి (1 కొరింథీ 14:40). వారి సమావేశములలో క్రమము, మర్యాద కొనసాగాలంటే వారు కొన్ని నియమములు పాటించాలి. ఆనియమములు నోటి మాట ద్వారాగాని, వ్రాత పూర్వకముగా గాని లేదా సంప్రదాయ బద్ధముగా గ్రహించుకొన్నట్టివిగాని కావచ్చును. పెద్దల సమావేశములో క్రమము మర్యాద పాటించబడాలంటే వారు కొన్ని ఖచ్చితమైన నియమముల నేర్చుకోవాలి. అపార్థములు రాకుండు నిమిత్తము ఈ నియమములు లిఖింపబడాలి. ఆత్మ కలిగించు ఐక్యతను కాపాడుకొనుటకు పెద్దలు ప్రయత్నం చేయకపోతే ఏ నియమములు కూడ పనికిరావు. అయితే యధార్థముగా ఐక్యత కొరకు కృషిచేయు వారికి సహాయార్థముగా ఆమోదయోగ్యమైన నియమములుంటే మంచిది.

పెద్దల మధ్య భేదాభిప్రాయములు పొడసూపకముందే వారందరు ఒక అంగీకారానికి వచ్చుట మంచిది. శాంతి యుత వాతావరణములో కూర్చొని వారు ఈ నియమముల విషయమై అంగీకారా

నికిరావాలి. భేదాభిప్రాయాలు వస్తే పెద్దలు ఏకాభిప్రాయమునకు రాలేరు. కోపబుద్ధి వలన వారు సరిగా ఆలోచించ లేరు.

సహోదరులు శాంతియుతంగా ఐక్యత కలిగి పనిచేయు నిమిత్తము నియమముల నేర్పాటు చేసికొనుటకు దిగువకొన్ని సలహాలనిచ్చుచున్నాము.

**పెద్దల కార్యక్రమముల నియమావళి :**

సంఘములో ఐక్యత కలిగియుండుటకు పెద్దలలో ఐక్యత అవుసరమని గ్రహించి, దిగువ నియమావళి చొప్పున పనిచేయుటకు ఒప్పుకొనియున్నాము. స్వేచ్ఛా పూర్వకముగా ఈ ఒప్పందములో ప్రవేశించాము. ఏలయనగా క్రీస్తు సంఘము యొక్క ఐక్యత గొప్ప ప్రాధాన్య మైనది.

1. ప్రతివాడు తన బాధ్యతలను స్వేచ్ఛా పూర్వకముగా నిర్వర్తించుట కొరకు, పెద్దల సమావేశములో ప్రతి పెద్ద కూడ తన అభిప్రాయములను స్వేచ్ఛగా తెలియజేయ వచ్చును. మరియు అతడు చెప్పునదేదీ బయటకు తెలియజేయబడదు.

2. పెద్దల సమావేశములో చర్చించుటకు వచ్చిన ఏ అంశమైనను పెద్దలందరు చర్చించుటకు స్వేచ్ఛగల వారు. వారి చర్చ అనంతరం ఆ అంశాన్ని గూర్చి పెద్దల అభిప్రాయమును తెలిసికొనాలి. మెజారిటీ పెద్దల అభిప్రాయాన్ని అమలు పర్చాలి. భిన్నాభిప్రాయమును వెలిబుచ్చిన పెద్దలు మెజారిటీ పెద్దలతో ఏకీభవించి పని చేయాలి.

3. కాలము గడుచుసరికి మెజారిటీ పెద్దల అభిప్రాయము చొప్పున నడుచుకొనడానికి మైనారిటీ పెద్దలకు నచ్చకపోతే వారు పదవీ విరమణ చేయవచ్చును. యిది సంఘ ఐక్యతను కాపాడుకొనుటకు మాత్రమే జరిగించబడాలి.

4. పెద్దలలో ఎవరైనా మెజారిటీ పెద్దల అభిప్రాయములను వ్యతిరేకిస్తూ యున్న యెడల అతని సహకారము కొరకు అన్ని విధాల ప్రయత్నం చేయాలి. అట్లయినను అతని సహకారములభించని యెడల అప్పుడు మెజారిటీ పెద్దలు అతనిని పెద్దగా విరమించుకోవాలని సలహా నియ్యాలి. యిది సంఘములో శాంతి కొరకు చేయబడాలి.

5.ఏదైన పెద్ద స్వయంగా బాధ్యత విరమించుకొనినా, లేక బాధ్యత విరమించు కొనునట్లు సలహా ఇయ్యబడినా అతడు శాంతియుతముగానే ఆ స్థానము నుండి తప్పుకోవాలి. మరియు సంఘ కార్యక్రమములకు తన పూర్తి సహకారము నందించాలి. అతడు సంఘములో కలతలకు. భేదాభిప్రాయములకు స్థావరము కాకూడదు.

6. పెద్దలందరు యిచ్చినదే తప్ప ఏ ఒక్క పెద్ద కూడ దేనినైనా చేయుటకు, చెప్పుటకు అధికారముగలవాడు కాదు. అతడు సంఘమునకుగాని, సంఘము దరపున గాని ఎవ్విధమైన ఒప్పందములు చేయరాదు; పెద్దలందరి నిర్ణయము చొప్పుననే నడుచుకోవాలి.

7. సంఘ కార్యకలాపములకు సంబంధించిన సంగతులన్నీ పెద్దల సమావేశములో నిర్ణయించబడతాయి. ఏదైనా ప్రత్యేక సమావేశము జరిగించిన యెడల మెజారిటీ పెద్దల అభిప్రాయములనే అమలుపరచుకోవాలి.

8. పైన చెప్పిన నియమములు పొడిగించుకోవచ్చు, తగ్గించుకోవచ్చును. పైన చెప్పినవన్నీ కాబోయే సంఘ పెద్దలకు ఇచ్చిన సలహాలే. స్థానిక సంఘము యొక్క పెదలు వారికి అనుకూలమగు వాతావరణం సృష్టించుకొని వారిలోను, సంఘములోను ఐక్యత కొనసాగించు కోవాలి.

ఈ విధమైన కొన్ని నియమముల నేర్పరచుకొని స్థానిక సంఘపెద్దలు పనిచేస్తే, సంఘ కార్యక్రమములు క్రమముగాను, మర్యాదగాను జరుగుటకవకాశము కలుగును.

L.R. విల్సన్

## 1కొరింథీ 13లో వర్ణించబడిన దేవుని ప్రేమ

పరమందొక దేవుడున్నారు! ఆయన ఎట్లుంటారు? దేవుడు ప్రేమయై యున్నాడని గతపాఠంలో ఒక లేఖనాన్ని చూచాము (1 యోహాను 4:8). దేవుని ప్రేమను వర్ణించాము. దానికి పొడవు, వెడల్పు, లోతు, ఎత్తు యున్నవి, దేవునిని అర్థంచేసి కొనడానికి అట్లు వర్ణించాము, ఏలయనగా దేవుడు ప్రేమ యైయున్నాడు. మనము ప్రేమను అర్థం చేసికొంటే దేవుని అర్థం చేసికొనగలము.

**వాక్యములో వర్ణించబడిన దేవుని ప్రేమ**

1 కొరింథీ 13:4-8లో అపొ.పౌలు నిర్వచించిన దేవుని ప్రేమను గూర్చి ఇప్పుడు తెలిసికొందాము. ఈ లేఖన భాగము యొక్క విశ్లేషణవలన ప్రేమయై యున్న దేవుని గ్రహించుకొనుటకు మనకు వీలవుతాది: "ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును. ప్రేమ మత్సరపడదు, ప్రేమ డంబముగా ప్రవర్తింపదు, అది ఉప్పొంగదు, అమర్యాదగా నడువదు, స్వప్రయోజనమును విచారించుకొనదు, త్వరగా కోపపడదు, అపకారమును మనస్సులో ఉంచుకొనదు, దుర్నీతి విషయమై సంతోషపడక సత్యమునందు సంతోషించును. అన్నిటికి తాళుకొనును, అన్నిటిని నమ్మును, అన్నిటిని నిరీక్షించును, అన్నిటిని ఓర్చును ప్రేమశాశ్వత కాలముండును.

**ప్రేమ సహించును:**

ప్రేమ యొక్క లక్షణములను ఒక్కొక్కదానిని పరీక్షింతము. ప్రేమ సహించునను వాస్తవాన్ని అందరు ఎరిగి యున్నదే. తల్లి బిడ్డలకు జన్మనిచ్చుటలో సహించుకొంటాది. వారిని పెంచుటలో, పోషించుటలో సహించుకొంటాది. ప్రియురాలు తన ప్రేమికుని కొరకు సహించుకొంటాది, క్రీస్తుద్వారా దేవుడు మన కొరకు సహించుకొన్నారు. "క్రీస్తుకూడ మీ కొరకు బాధపడి మీకు మాదిరి యుంచి పోయెను" (1 పేతురు 2:21). ప్రేమ సహించుటయేకాదు, ప్రేమ దీర్ఘకాలము సహించునని అపొ. పౌలు చెప్పాడు. యెహోవా దీర్ఘశాంతుడని సంఖ్యా 14:18 చెప్పుచున్నది, "యెహోవా దయా దాక్షిణ్య పూర్ణుడు, దీర్ఘ శాంతుడు, కృపాసమృద్ధి గలవాడు .........మన పాపములను బట్టి మనకు ప్రతిఫల మియ్యలేదు, మనదోషములను బట్టి మనకు ప్రతిఫలమియ్యలేదు" అని కీర్తన 103:8-10 చెప్పుచున్నది. దేవుడు మనలను ప్రేమించుచున్నారు గనుక మనము పాపము చేసినప్పుడు ఆయన బాధనొందును. అయినను ఆయన దీర్ఘశాంతుడు, కృపాసమృద్ధిగలవాడు. రూతు యెడల బోయజు దయచూపించాడు. ఆమె పరగ ఏరుకొనునప్పుడు ఆమె కొరకు పిడికెళ్ల పడవేయుడని తన పరివారితో అతడు చెప్పాడు. బాలుడైన మోషే యొక్క ఏడ్పును బట్టి ఫరోకుమార్తె అతనిపై జాలిగొనెను. అయితే ఈలోకంలో యున్న జాలి గల వారందరికంటె దేవుడు చాల జాలి గలవాడు.

**ప్రేమదయ చూపించును:**

ప్రేమ మత్సరపడదు, యితరుల యెడల కుళ్ళుకోదు. దేవుడు ఎవరియెడల మత్సరపడదు, ఈర్ష్య చూపించడు. ఆయనను అసహ్యించుకొను వారిని సయితము ఆయన ప్రేమించును. దేవుడు లేడని వాదించు వారిని సయితము ఆయన ప్రేమించును, వారి యెడల జాలిగొనును.

**ప్రేమసాత్వికము గలది**

ప్రేమ ఉప్పొంగదు, అమర్యాదగా నడువదు, మనం ప్రార్థించునప్పుడు గాని, ధర్మము చేయునప్పుడు గాని మనముందర బూర ఊదింపకూడదు. ఉపవాసము ఉంటే మనుష్యులకు గాక, దేవునికి అదికనబడాలి. మంచిని జరిగించుటకు ప్రేమబయలు దేరినప్పుడు అది డంబముగా ప్రవర్తింపదు, ఉప్పొంగదు, సాత్వికముతో పని చేయును. క్రీస్తు యొక్క మరణములో దేవుడు తన్నుతాను తగ్గించుకొని ఆయనను విడిపించుటకు తన శక్తిని ప్రదర్శించలేదు ఏలయనగా ఆయన మనలను ప్రేమించారు, యిది ప్రేమయై యున్న దేవుని నిజ లక్షణము.

**ప్రేమ కొనసాగుచు యుండును:**

ప్రేమ అమర్యాదగా నడువదు అంటే, అది ఎల్లవేళలా వినయము, విధేయత కలిగి యుండును. మర్యాదగా ప్రవర్తించును. ప్రేమించు మనుష్యుని యొక్క ప్రాధమిక లక్షణం యిది, ప్రేమించు మనుష్యుడు అన్నిటిని ప్రేమించును. ప్రకృతిని, పశువులను, పక్షులను, మానవుని ప్రేమించును. అందువలన అందరు అతని ప్రేమిస్తారు. దేవుడు తన సృష్టి నంతటిని ప్రేమిస్తు దాని యందు ఆనందిస్తారు. "లోకము యెహెూవా కృపతో నిండి యున్నది" యని కీర్తన 33:5 చెప్పుచున్నది.

**ప్రేమ నిస్వార్ధమైనది:**

ప్రేమ స్వప్రయోజనమును విచారించుకొనదు. మనం ఆయన శిష్యులుగా యుండగోరితే ప్రతిదినము "తన్నుతాను ఉపేక్షించు కొనవలెనని" క్రీస్తు బోధించారు. స్వార్ధపరులను, అహంకారులను ఎవరు ప్రేమించరు, సరిగదా ద్వేషిస్తారు. యితరులను గూర్చి ఆలోచిస్తు వారికొరకు కృషి చేయు వారిని నిజముగా ప్రేమిస్తారు. దూతలతోను భక్తులతోను ఆరాధింపబడు నిమిత్తము దేవుడు స్వార్ధపరుడై పరలోకమునకే పరిమితి కాలేదు. ఆయన ఈ లోకమును మానవుని సృజించి, మానవునిలో తనదైన దైవిక భాగాన్ని కొంత ఉంచారు. మనం ఆయనను వెదకి కనుగొనునట్లు అట్లు చేసారు. ఆయనమనలో ఎవనికిని దూరముగా ఉండువాడు కాడు. మనమాయన యందు బ్రదుకుచున్నాము, చలించుచున్నాము, ఉనికిని కలిగి యున్నాము. అందువలన దేవుడు సరదాగా తన సింహాసనము మీదనే కూర్చొని యుండ లేదు గాని ఆయన మనందరిని గూర్చి చింతిచుచు మన హృదయ కోరికలను, తలంపులను ఎరిగి యున్నారు. జీవ గ్రంధములో మనందరి క్రియల రికార్డును ఆయన భద్రపరచుచున్నారు. పరలోకములో మనం ఆయనను సేవించుచు ఆయన ముఖ దర్శనము చేతుమని ప్రకటన 22:3 చెప్పుచున్నది. గనుక పరలోకములో కూడ మనం యితరుల కొరకు పనిచేయుచుందుము. గనుక "ప్రభువా, నా కొరకు కాదుగాని యితరుల కొరకు నీవలే జీవించుటకు నాకు సహాయము చేయుమని" మనం అనుదినము ప్రార్ధించాలి.

**ప్రేమత్వరగా కోపపడదు:**

ప్రేమ కోపడును గాని, త్వరగా కోపడదు. దేవుని ప్రేమ చాల గొప్పది. ఆయన దీర్ఘశాంతుడు, దయగలవాడు. అయినను, అన్యదేవలతలకు ధూపార్పణము చేయుచు "మీ చేతి క్రియలచేత నాకు కోపము పుట్టించుచున్నారు" అని యిర్మీయా 44:8 లో ఆయన చెప్పుచున్నారు. "ప్రతిమనుష్యుడు కోపిం

చుటకు నిదానించువాడునై యుండ వలెనని" యాకోబు 1:9 చెప్పుచున్నది, మరియు "సూర్యుడస్తమించు వరకు మీ కోపము నిలిచి యుండరాదని" ఎఫెసీ 4:26 చెప్పుచున్నది. దేవుడు దీనిని మననుండి కోరుచున్నట్లయితే కోపించుటకు ఆయన మరింత నిదానించు వాడై యుండ వలెను గదా.

**అన్నింటిలోను ప్రేమ మంచినే కనుగొనును.**

ప్రేమ అపకారమును మనస్సులో ఉంచుకొనదు. ప్రేమించువారు అందరి లోను ఏదో కొంతమంచిని చూస్తారు. దుర్మార్గులు అన్నిటిలోను, అందరిలోను దుర్మార్గతనే చూస్తారు. మనుష్యులందరు చెడ్డవారేయని కొందరు అనుకొంటారు గాని " దేవుడు తాను చేసినది యావత్తును చూచినప్పుడు అదిచాల మంచిదిగ యుండె ను" అని ఆదికాండము 1:31 చెప్పుచు న్నది.

**సత్యమునందు సంతోషించును :**

ప్రేమదుర్నీతి విషయమై సంతో షపడక, సత్యమునందు సంతోషించును. మొదటిగా సత్యము సంతోషించునను సంగతిని మనం గమనించాలి. ప్రేమించు వారు నిజంగా సంతోషభరితులు. అన్నిటికంటె గొప్ప దైన దేవుని ప్రేమను బట్టి దూతలు, పరిశుద్ధులు ఆయన యెదుట సాగిల పడి స్తోత్రగానము చేతురు. ఎందువలన? వారు సంతోషముగా యున్నందు వలన. ఒక్కోసారి పాపములో యున్న వాడు సంతోషించు చున్నట్లగు పడును. పాపములో కొంత ఆనందము న్నది. అయితే పాపభోగము అల్పకాల మేయని హెబ్రీ 11:25 చెప్పుచున్నది. పాపములో స్వల్ప ఆనందమున్నను, క్రైస్తవుడు దానిని నిరాకరించును. యేసును వెంబడించువాడు అనుదినము తన్నుతాను ఉపేక్షించుకోవాలని ఆయన చెప్పెను (లూకా 9:23). "క్రీస్తు యేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛల తోను దురాశలతోను సిలువ వేసియు న్నారని" గలతీ 5:24 చెప్పు చున్నది. చెడ్డదానిని అసహ్యించుకొనుటకు క్రైస్తవుడు ఎల్లవేళల నేర్చుకొనును (రోమా 12:9). గనుక నిజక్రైస్తవునికి దుర్నీతియందును, పాపమునందును యేమీ సంతోషము లేదు. గాని అతడు సత్యమునందు సంతో షించును. క్రైస్తవుడు చెప్పన శక్యమును, మహిమా యుక్తమునైన సంతోషము గలవాడై యున్నాడని 1 పేతురు 1:8 చెప్పుచున్నది. " నీ సన్నిధిని సంపూర్ణసం తోషము కలదు. నీ కుడి చేతిలో నిత్యము సుఖములు కలవు'' అని కీర్తనలు 16:11లో వ్రాయబడియున్నది. ఈ లోకం లో మన జీవితం అంతమయిన తరువాత మనం దేవుని యొక్క సంతోషములో

ప్రవేశిస్తామని మత్తయి 25:21 చెప్పుచున్నది.

ప్రేమ యొక్క అత్యున్నత స్థితిని చెబుతు పౌలు, "ప్రేమ అన్నిటికి తాళుకొనును, అన్నిటిని నమ్మును, అన్నిటిని నిరీక్షించును. అన్నిటిని ఓర్చును" అని చెప్పాడు (1కొరింథీ 13:7).

**అన్నిటికి తాళుకొనును**

దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వమునుండి విడిపించి బయటకు తీసికొని వచ్చినప్పుడు వారు పాపము చేసారు, ఐగుప్తుకు తిరిగి వెళ్లిపోదలచారు విగ్రహములనారాధించారు, సణగారు, కానాను దేశమును వారు జయిస్తామని నమ్మలేదు, అయినను పాలిచ్చి పెంచెడు తండ్రి పసిపిల్లలను మోయునట్లు దేవుడు వారిని తన రొమ్మున మోసారు (సంఖ్య 11:12). "నిశ్చయముగా ఆయన మన రోగములను భరించెను, మన వ్యసనములను వహించెను" (యెష 53:4). "క్రీస్తు అనేకుల పాపములను భరించుటకు ఒక్కసారే అప్పగింపబడెనని" హెబ్రీ 9:28 చెప్పుచున్నది. మనము ఒకని భారములను ఒకడు భరించి యీలాగు క్రీస్తు నియమును పూర్తిగా నెరవేర్చ బాధ్యులమై యున్నాము (గలతీ 6:2).

**అన్నిటిని నమ్మును**

ప్రేమ భరించడమేకాదు, అది అన్నిటినినమ్మును. యిది దేవుని యొక్క యదార్థతను బైబిలు సూచించుచున్నది. "నాదేవుడైన యెహోవా నీతో కూడ నుండును... ఆయన నిన్ను ఎంత మాత్రమును విడువక యుండును" అని 1 దినవృ 28:20 చెప్పుచున్నది. ప్రభువు తన భక్తులను విడువడు, వారెన్నటెన్నటికిని కాపాడబడుదురు" అని కీర్తన 37:28 చెప్పుచున్నది. ప్రభువు మన యందు నమ్మిక కలిగియున్నారు, మరియు ప్రేమద్వారా ఆయన మనలను విమోచించెదనని ఎరిగియున్నారు. దేవుని ప్రేమించువారికి మేలుకలుగుటకై సమస్తము సమకూడి జరుగునని రోమా 8:28 చెప్పుచున్నది.

**అన్నిటిని సహించును :**

ప్రేమ నిరీక్షించును, అన్నిటిని సహించును, దేవుని కృప నిత్యము వుండును (కీర్తన 52:1). " యెహోవా దయాళుడు ఆయన కృప నిత్యముండును, ఆయన సత్యము తరతరములుండును" అని కీర్తన 100:5లో చెప్పబడినది. క్రీస్తు తన యెదుట ఉంచబడిన ఆనందము కొరకై అవమానమును నిర్లక్ష్య పెట్టి సిలువను సహించి దేవుని సింహాసనము యొక్క కుడి పార్శ్వమును ఆసీనుడై యున్నాడు" (హెబ్రీ 12:2).

**ప్రేమ శాశ్వత కాలముండును**

ప్రేమ యొక్క శిఖరాగ్రముగా ప్రేమ శాశ్వత కాలముండునని అపొ.పౌలు చెప్పాడు (1 కొరింథీ 13:8). ఈ లోకారంభము నుండి దేవుడు మానవుని ప్రేమించారు, నిత్యము ఆయన ప్రేమించుచుయుంటారు. మనము దానిలోతును కొలువలేము గాని ఆయనకు ఎంతో కృతజ్ఞత కలిగి యుండాలి. దేవుని ప్రేమ ఎన్నడు ఎడబాయలేదు. ఎన్నడు ఎడబాయదు. ఆయన గొప్ప ప్రేమను బట్టి మనలను విమోచించెదనని ఆది నుండియు దేవుడు ఎరిగి యున్నారు, పాపియైన మానవుడు తన ఆత్మ యొక్క సేదను తీర్చుకొనుటకు దేవుని ప్రేమ గొప్ప నీటి ఊటగా యున్నది, శ్రమలలో ఆయన ప్రేమమనకు ఆశ్రయ దుర్గమై యున్నది. శోధనలలో అది మనకు ఆశాకిరణమై యున్నది. మరణంలో మధురమైన నిర్ధారణ యై యున్నది పరలోకంలో దానిని పూర్తిగా గ్రహించుకొందుము. అది విమోచింప బడినవారి నిత్య ఆనందగానము. ఆశ్చర్యకరమైన తనగొప్పప్రేమకు దేవునికి స్తోత్రములు! దేవుడు ప్రేమ యై యున్నాడు!

## దీనిని గూర్చి నీవు ఆలోచించావా?

(Have you thought About this ?)

ప్రతి వ్యక్తి ఏదో ఒక మార్గములో నడుచుచున్నాడు. భౌతికాంగా మనం జీవము నుండి మరణమునకు నడుచున్నాము. మనం ఎంచుకొనిన మార్గము ఆత్మీయ జీవముకు లేదా ఆత్మీయమరణముకు గాని నడిపించవచ్చును. అయితే అందరూ ఏదో ఒక గమ్యముకు చేరువగుచున్నామనునది వాస్తవము. గనుక మనం జ్ఞానయుక్త మైన నిర్ణయాలను గైకొనాలి మనం చివరకు ఏ గమ్యానికి చేరుకొంటాము?

దీనిని గూర్చి ఆలోచించావా? మనం పయనించడానికి వేలకొలది మార్గములున్నాయని సహజంగా ప్రజలు తలస్తారు. అయితే మన నిర్ణయాన్ని బట్టి మన అంతిమ యాత్ర జీవములోనో లేక మరణములోనో ముగియును.

మనం పౌరాణిక దేవుండ్లను, ఆచారకర్మలను అనుసరిస్తామా? మూఢనమ్మకములను, పూజా పద్ధతులను అనుసరించెదమా? పెక్కు మంది పయనించు మార్గము మనకు ఆకర్షణీయమా? మనతలితండ్రుల మతమే మనదేనా? మానవ కల్పిత మతములను మనం అనుసరించెదమా?

మనకు దగ్గరగా యున్న డినామినేషనే మనకు సంతృప్తి కరముగా యున్నదా? ఏమతము లేకుండా మనకు అంతా బాగానే యున్నదా?

దీనిని గూర్చి ఆలోచించావా?

బైబిలు ఇట్లు చెప్పుచున్నది. "ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు అయితే తుదకు అది మరణమునకు త్రోవతీయును" (సామె 14:12). "యెహోవా, తమ మార్గము నేర్పరచు కొనుట నరులవశములో లేదనియు మనుష్యులు తమ ప్రవర్తన యందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదనియు నేనెరుగుదును" (యిర్మియా 10:23).

"యేసు నేనేమార్గమును, సత్యమును జీవమును, నాద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" (యోహాను 14:6). "నేనే ద్వారమును, నా ద్వారా ఎవడైన లోపల ప్రవేశించిన యెడల వాడు రక్షింపబడును" (యోహాను 10:9). యేసు దేనికి ద్వారము? "గొర్రెలు పోవుద్వారము నేనే......... నేను గొర్రెలకు మంచి కాపరిని, నేను నా గొర్రెలను ఎరుగుదును, నా గొర్రెలు నన్ను ఎరుగును. మరియు గొర్రెలకొరకు నా ప్రాణము పెట్టుచున్నాను. ఈ దొడ్డివి కాని వేరెగొర్రెలును నాకుకలవు; వాటిని కూడ నేను నేను తోడుకొని రావలెను అవి నా స్వరము వినును అప్పుడు మంద ఒక్కటియు గొర్రెలకాపరి ఒక్కడు అగును" (యోహాను 10:7; 14-16).

దీనిని గూర్చి ఆలోచించావా ? యేసు యొక్క మాటలను బట్టి :

ఎన్ని సత్యములున్నాయి? ఒకే ఒక్కటి

ఎంతమంది రక్షకులున్నారు ఒకే ఒక్కడు

ఎన్ని ద్వారములున్నాయి? ఒకే ఒక్కటి

ఎంతమంది గొర్రెలకాపరులు ? ఒకే ఒక్కడు.

గొర్రెల దొడ్డిలు ఎన్ని ? ఒకే ఒక్కటి

జీవముకు పోవు మార్గములెన్ని? ఒకే ఒక్కటి.

దీనిని గూర్చి ఆలోచించావా? దేవుని యొద్దకు అనేక మార్గములున్నాయి, వాటిలో నీ కిష్టము వచ్చిన దానిని ఎంచుకోవచ్చుని మానవులు చెబుతారు. గాని మన రక్షకుడైన యేసుక్రీస్తు మనుష్యులు సాధారణంగా పయనించు రెండే రెండు మార్గములున్నాయని చెప్పారు. " ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును ఆదారి విశాలమునై యున్నది, దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆదారి సంకుచితమునై యున్నది. దానికనుగొను వారు కొందరే" యని ఆయన పలికారు (మత్తయి 7:13-14). దీనిని గూర్చి నీవాలోచించావా? క్రొత్త

నిబంధనలో ఇరుకును సంకుచితమునై యున్న మార్గము ఒక ప్రత్యేకమైన ప్రజలైయున్నారు. పౌలు "ప్రధాన యాజకుని యొద్దకు వెళ్లి యీ మార్గమందున్న పురుషులనైనను స్త్రీలనైనను బంధించి యెరూషలేమునకు తీసికొని వచ్చుటకు దమస్కులోని సమాజములవారికి పత్రికలిమ్మని అడిగెను" (అపొ.కా. 9:1-2). గనుక యీ మార్గమందున్న వారు నిజముగా, హింసింపబడుటకు ప్రత్యేకముగా గుర్తించదగిన ప్రజలు. "ఆకాలమందు క్రీస్తు మార్గమును గూర్చి చాల అల్లరి జరిగెను" (అపొ.కా. 19:23). ఎఫెసులో పౌలు దేవుని రాజ్యమును గూర్చి తర్కించుచు ఒప్పించుచుండెను గాని కొందరు యొప్పుకొనక జనసమూహము ఎదుట ఈ మార్గమును దూషించుచున్నందున వారిని విడిచి వెళ్లెను (అపొ.కా. 19:8-9).

ప్రజలు దేవుని రాజ్యమును గూర్చిన వర్తమానమును నిరాకరించినప్పుడు వారు యీ మార్గమును దూషించిరి. వారు చిరకాలము కనిపెట్టుచున్న రాజ్యమే యీ మార్గము, అదే క్రీస్తు సంఘము. "నేను కూడ దేవుని యందు నిరీక్షణయుంచి వారు మత భేదమని పేరు పెట్టు ఈ మార్గము చొప్పున నా పితరుల దేవుని సేవించుచున్నానని తమరి యెదుట ఒప్పుకొనుచున్నానని" పౌలు చెప్పెను (అపొ.కా. 24:15). గనుక పౌలు ఈ మార్గమందున్న సభ్యుడు. అందున్నవారు దేవుని ప్రత్యేక పద్ధతిలో ఆరాధించేవారు. దీనిని గూర్చి నీవాలోచించావా? జీవమునకు పోవు మార్గము ఒకే ఒక్కటి యున్నదని, ఆ మార్గముతానేనని యేసు చెప్పెను. ఆ మార్గమును వెంబడించిన ఆదిమ క్రైస్తవులు ప్రజామోదము పొందిన వారు కారు. వారు బోధించిన బోధ ప్రజామోదము పొంద లేదు. తమ ప్రభువు వారికేమి బోధించెనో దానికే వారు బోధించినందున వారు ద్వేషింపబడ్డారు, హింసింపబడ్డారు. అనేక మార్గములు లేవు, ఆమోదము పొందిన అనేక మతములులేదు, అనేక సంఘములు లేవు, రక్షింపబడే అనేక మార్గములు లేవు, దేవుని ఆరాధించే అనేక పద్ధతులు లేవని వారు బోధించారు.

నేడు లోకంలో వేలకొలది సంఘాలు, వేలకొలది సిద్ధాంతాలు యున్న సందర్భములో ఏకత్వమును గూర్చి లేఖనాలలో యున్న వర్తమానము ప్రత్యేకముగా గుర్తింపదగినది, లేఖనములలో ఉన్నది ఉన్నట్లు గానే బోధించే క్రైస్తవులను నేటి మతశాఖల ప్రపంచము ద్వేషించుచున్నది. అయితే వారుగాని, ఇంకెవ్వరు గాని లేఖనములలోని వర్తమానమున మార్చజాలరు.

## సంక్షిప్త వార్తలు

2011 జూలై 20వ తేదీ నాడు శేరిలంకలో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు రోయస్ ఫ్రెడరిక్‌గారు ప్రార్థన పూర్వకముగా ప్రతిష్ఠించిరి. ఆకూటమునకు రిక్కీగూటం గారు అయనతో యున్న అమెరికా యువక బృందము హాజరైరి. శేరిలంకలో టి. ఇశ్రాయేలుగారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

2011 జూలై 21 తేదీ గురువారంనాడు ముమ్మిడివరం మండలం గున్నేపల్లిలో నిర్మించ బడిన క్రీస్తుసంఘ ఆలయమును సోదరులు జాషువా గూటంగారు, రోయస్ ఫ్రెడరిక్ గారు ప్రభువు సేవార్థమై ప్రతిష్ఠించిరి. చక్కటి వాక్యము నందించిరి. చెయ్యేరు గున్నేపల్లిలో సోదరులు టి. యేసేపురాజు గారు క్రీస్తు కొరకు కష్టించి పని చేయుచున్నారు. జాషువా గారి సహాయ సహకారములతో, స్థానిక సంఘ కృషితో గున్నేపల్లిలోని ఆలయమును యేసేపు రాజుగారు చక్కగా రూపుదిద్దిరి. ప్రతిష్ట కార్యక్రమమునకు విచ్చేసిన వారందరికీ మంచి విందు చేయబడెను.

2011 ఆగష్టు 24వ తేదీ బుధవారం కాకినాడ మండలం పెనుగుదురు గ్రామములో రాచపూడి వారి గరువులో నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయమును జాషువాగారు ప్రార్థన పూర్వకముగా రిబ్బను కత్తిరించి ప్రభువు సేవార్థమై ప్రతిష్ఠించిరి. స్థానిక సంఘము, కాకినాడ క్రీస్తు సంఘ సభ్యులు అనేకులు హాజరై ఆకార్యక్రమమును విజయవంతము చేసిరి, రిక్కీగారు ఆనాడు చక్కటి వాక్యపరిచర్య చేసిరి. సమీపముననున్న హైందవులు కూడ ఆకార్యక్రమములో పాల్గొనుట విశేషము. పెనుగుదురు రాచపూడి గరువులో సోదరులు దారా నాని గారు చాల కాలమునుండి సత్య సువార్తను చాటుచున్నారు, అయన కృషికి ఫలితముగా ఆగ్రామములో క్రీస్తు సంఘ ఆలయము నిర్మించ బడినందున దేవునికి స్తోత్రములు.

2011 ఆగష్టు 27వ తేదీ శనివారం కాకినాడ సత్యవాణి క్రీస్తు సంఘ ఆవరణములో సువార్తికుల సదస్సు జరిగెను. ఆ సదస్సుకు ఇంచుమించు 150 మంది సువార్తికులు హాజరైరి. సోదరులు ఎలిపే ప్రభాకర రావ్, యస్, యేసురత్నం, రిక్కీగూటం గార్లును కర్నాటక నుండి వచ్చిన సోదరులు ప్రసాద్ గారును వాక్యపరిచర్యచేసిరి. సోదరులు యన్. ఏలియా, జి. షద్రక్, యన్. మోజెస్ గార్లు పాటలు, ప్రార్థన కార్యక్రమములలో సహకరించిరి. వచ్చిన వారందరికీ రిక్కీగూటం గారు చక్కటి భోజన పానములను ఏర్పాటు చేసిరి.

గమనిక ::

సత్యవాణి కార్యక్రమములను

ప్రతి బుధవారము సాయంత్రం 6:30 గంటలకు

రక్షణ ఛానల్ లోను, శనివారం ఉదయం 8 గంటలకు

ఆరాధన ఛానల్ లోను, మరియు ఆదివారం సాయంత్రం 6:00

గంటలకు శుభవార్త ఛానల్‌లోను చూడండి.

సత్యవాక్కు మాస పత్రిక కావాలంటే

సంవత్సరమునకు 50/- రూ॥లు చెల్లించవలెను.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/2009-11

To

From:

**SATYA VAKKU**

P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004